నా ఉపన్యాసం అంతా బూడిదలో పోసిన పన్నీరు చేశావే."

౨

"ఏమేవ్......ఇదిగోనిన్నే...నిన్నే నే..."

"ఏమిటండీ ఎపుడూ ఏమే ఏమే అని. రాత్రి 10 గంటలయితే నిద్రపోక."

"ఇదుగో చూడు..ఎందుకట్లా విసుక్కుంటావు."

"విసుక్కునేదేమిటండీ. తెల్లవారిజామున నాలుగుగంటలకు లేస్తే రాత్రి 10 గంటలాయె నడుము వాల్చేటప్పటికి. ప్రొద్దున్నే ఉప్మాలు కాఫీలు, పదిగంటలకే 'ఐపోయెఐపోయె' నంటూ ఏమో లోకమంతా మునిగిపోయినట్టు అన్నానికి ఒకటే తొందర. మధ్యాహ్నం యథావిధిగా టిఫిన్లు, సాయంత్రం టీ. ప్రొద్దూకటమే ఆలస్యం. 'ఏమే ఇవ్వాళ ఏమయినా వంట అయేటట్టుందా' అని ఒకటే కేకలు, ఎక్కిరింతలు. ఎట్లాగమ్మా ఈ సంసారం చేయటం. నాకేం దరి దోవ తోచకుండావుంది."

"ఏమిటా వుపన్యాసం. ఎవ్వళ్లన్నా వింటే మన సంసారం నిప్పు లేకుండానే గగనజ్వాలా పర్యంతరముగావుంది అనుకొంటారు. మన సంసారం గుట్టు, నీ మంచితనం, నా మర్యాద ఎట్లో కలుస్తయి."

"మన సంసారానికి గుట్టా, గుట్టట గుట్టు. నేను నోరు తెరిస్తే గుట్టు ఏట్లోకలుస్తుంది. ఎవ్వళ్లైదాకా వస్తేకాని వాళ్లకు తెలియదు. ఆడవాళ్ల కష్టాలు మొగాళ్లకేం తెలుస్తయి. ఏనకాడికి వార్చి ముందర పెడుతుంటే మింగటం మాత్రం చాలాబాగా తెలుసు. అంతేకాని, ఇట్లా వార్చి ముందరపెట్టేసరికి ఎంత కష్టపడుతున్నారో అని లేరు సరేకదా 'ఏమి ఇంకా కాలే వంట?' అని అధికారము ఛలాయించటానికి మాత్రము మొగాళ్లకు కావలసినంత మొగతనముంది. మాకేమి తెలుస్తుంది. సంసారం దిద్దుకొనే టప్పటికి తలప్రాణం తోక కొస్తుందని. అంతే లెండి. చద్ది అన్నము తిన్న అమ్మ మొగుడి ఆకలి ఎరగదట."

"నిజంగా అంతే. ఔను కానినిజంగా చద్ది అన్నము తింటావా."

"అనండి అనండి—"

"అనేదేమిటి కాని అది చాలా అన్యాయం. నువ్వు ప్రొద్దున్నే చద్దిఅన్నం తిని, 10 గంటలదాకా ఈ మానవుడి పొట్ట మాడబెట్టి, ఉడికి ఉడకని అన్నం, ఉప్పులేని పప్పు, కారంపడని కూర, సగం నూరిన పచ్చడి, మా మొగాన తగలేస్తావు. అదేమంటే, 'ఈ సంసారం ఎట్లా గడుస్తుందో నాకు తోచకుండా వుంది' అని గ్రామసింహము,అర్ధరాత్రి అపుడు తీసే ఆనాద నామక్రియ రాగాన్ని అరుకు ఒకటి కలిపి, 'ఏమో! ఏమి శాశ్వతం' అన్నట్టు ఆ అరున్నొకటికి ఇంకొక అరకూడా చేర్చి,మదరాసులో తాంబరంనుండి పరిగెత్తే ఎలక్ట్రిక్ రైళ్లు నీళ్లులేక పోవడంమూలాన పీక ఎండి, బయటికి సగము వచ్చీరాని కంఠంతో గింగురులెత్తేట్టు అరిచినట్టు నువ్వుకూడా అదే శృతితో అదే స్థాయిలో, క్రమముతప్పకుండా, ఒక్కకళకూడా జారిపోకుండా గట్టిగా పట్టుకొని, నా త్రాడు పెకేలునుని తెగేటట్టు ఆలాపన చేస్తావు. ఇట్లా చేస్తే ఎట్లా చెప్పు మనలో మాట. అంటే నీకు కోపమాయె ఒక్క కోపముతో ఆగిపోతే బాగుండు. మూతిఅంతా వెనక్కువిరిచి, జుట్టంతా విరియబోసుకొని, పిచ్చి కళతాండవిస్తున్నట్టుగా కనుపడుతుందాయె నీ ముఖం. అట్లాటి ముఖంలో ఒక్కటే తక్కువ. రెండు చెంపలు కొట్టుకున్న ఫేస్ పవుడరు అంతా పోయేటట్టు

సాల్గుపేళ్లు తేలేటట్లా పీక్కు_న్నావంటే, నిజంగా కూడ అతి శీలవతియైన ఒక సినిమాతార, ఒక తెలుగు టాకీలో నటిస్తూ, వ్యభిచార భీతిచే తన బావమరదిని భయపెడదామని చేసినట్టిన్ని,దయాంతరంగులగు ప్రేక్షకులను "ఆహా! కష్టము" అని నోళ్లను కప్పులవలెగా తెరిపించిన అభినయనాన్ని నువ్వుకూడా చేయటమే కాక అ సినిమాతారనుకూడా మరిపిస్తావు."

"అసలే కవీశ్వరులాయె. అందులో హాస్యరస పటానులూ—అదేమిటోనమ్మ నాకురాదు. ఎట్లా మీతో మాట్లాడడం."

"హాస్యరస పటానులతోనే పోనిచ్చావు నయమే, వేయించిన బఠాణీలనలా."

"చాల్లెద్దురూ మూడురోజుల్లో ఉంది పండుగ. ఇంకా ఇంట్లో పనులకి తలాతోకకూడ బయట పడ లేదు."

"సరేలే ఇక పడుకో."

"తెస్తానంటేనే కావలసిన సరుకులు."

"సరేలే. ఖర్మం."

"ఖర్మమేం బలవంత బ్రాహ్మణార్థం ఇక్కడేమీ లేదు."

## 3

"గుడ్ మార్నింగ్ దొరగారికి. మాది ఒకఊరు, ఒకపల్లె కాదండి. మేము బిచ్చగాండ్రము కాదండి. డబ్బులేక రాలేదండి, ధాన్యములేక రాలేదండి. పొయ్యిమీదికి ఎసరు, కట్టుకోడాని గుడ్డలేక వచ్చామండి. మా తాత 'సాహెబురావు' బిరుదాన్ని, ఒంటెనలు పడగొట్టించి, చెరువులు పూడ్పించి సంపాయించాడండి. అపుడో మా యింట్లో బంగారం మూలమూలా మూలుగుతుండేదండి." అని ఒక బిచ్చగాడు లెక్చరు కొడుతున్నాడు. వాడి నెత్తిమీద ఒకపుడు తెల్లగా ఉన్నటోపీ, వొంటిమీది జీర్ణవస్త్రములు అజీర్ణము జేసినవాడి పొట్ట బయట పెటు తున్నాయి. పాపాలభైరవ జేబుగుడ్డ. అతను ఇంట్లో నుంచి వచ్చాడు.

"ఒరే బాబూ ఈ ఇంట్లో నేనే ఒకబిచ్చగాడ్ని. నువ్వు నా కొక అవాంఛిత సోదరుడవు దొరికావే. పండగ అని మా ఆవిడ ఒకటే గోల—"

"ఒరే! పండగపూట బిచ్చమేమిట్రా. ఐనా కండలు బలిసి కొట్టుకొంటున్నావు. కూలి చేసుకో రాదూ."

"అమ్మా! తమరల్లా సెలవిస్తే—"

"పో అవతలికి ముందు. పోతావా శాపనార్థలేమన్నా కావాలా."

బిచ్చగాడు వెళ్లిపోయాడు.

"ఏమే! రోజూ పండగనో, పెట్టినా పెట్టక పోయినా తద్దినమనో చెప్పితే బిచ్చం ఖర్చు తగ్గుతుందల్లే వుంది."

"చాల్లేండి. పోయి అల్లుడ్ని తీసుకురండి."

"ఏమి అల్లుడో. మన అమ్మాయి మొగుడు కాదు కాని నా మొగుడైనాడు. 'మా ఇంటికి వచ్చి భోంచెయ్యవయ్యా' అంటే, 'మా నాన్నను అడగమం' టాడు. ఆయన 'వాడిష్టము' అంటాడు. 'ఏమయ్యా అల్లుడయ్యా' అంటే 'మా అమ్మని కనుక్కోండి' అంటాడు. ఆవిడ ఏమో, 'పోరా నాయనా. పిల్లకు చీర, రవిక తీసుకుపో. సంవత్సరంలోపల వెళ్లట మాయె' అంటుంది. పర్యవసాన మేమిటంటే మనము ఆయన కేదో వస్తురూపకంగానో, ద్రవ్యరూపకంగానో ముట్టచెప్పాలి. ఇక మనజేబు "హాల్లీకిహాల్లీ సున్నాకి సున్నా!"

"బాగానే ఉన్నది."

"ఈ ఇంట్లో నువ్వు పిల్లవి నేను అల్లుడ్ని ఇక కానీపండగ."

"అంతే దీపావళి కాస్తా కబుర్లతోనే అయే ట్టుంది."